క్లుప్తంగా

మంత్రి కాకాణి పరామర్శ



రమేష్‌ను పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : మండలంలోని నావూరుపల్లి వైఎస్సార్‌సీపీ నేత చొప్పా రమేష్‌కు ఇటీవల పితృవియోగం కలగడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఆయన్ను పరామర్శించారు. రమేష్ తండ్రి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సర్పంచులు గాలం వెంగయ్య, ఉడతా రమేష్, నాయకులు పలుకూరు పోలిరెడ్డి, సుబ్బానాయుడు, వెల్మిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు.

జీవనోపాధికి సాయం



సైకిల్, పనిముట్లను అందజేస్తున్న మురళీకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన పోలవరం రవికుమార్ అనే వ్యక్తి చాలా కాలంగా గ్యాస్ స్టౌలు మరమ్మతులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. ఇటీవల ఆయన సైకిల్, పనిముట్లను కొందరు అపహరించుకుపోయారు. దీంతో జీవనోపాధి కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక జ్యోతిష్యమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ సోమవారం రవికుమార్‌కు రూ.7,000లు విలువైన సైకిల్‌ను, రూ.1,500ల విలువైన పనిముట్లను అందజేసి ఆదుకున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేశారు.

సబ్ రిజిస్ట్రార్‌కు వినతి



సబ్ రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కొడవలూరు: ఇళ్ల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసే అధికారం తమకు లేదని, ఈ మేరకు లబ్ధిదారులను తమ వద్దకు పంపవద్దని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కోవూరు సబ్ రిజిస్ట్రార్ పి.శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శులు జి.రాధాకృష్ణ, ఎం.బ్రహ్మానందరెడ్డి, జి.జాలయ్య, ఎస్కే షబ్బీర్, ఎస్.విజయలక్ష్మి, ఆర్.శివకుమార్. డి.సురేష్‌కుమార్, అంకమరాణి, సురేష్ ఉన్నారు.

డిప్యూటీ పారా మెడికల్ అధికారికి డాక్టరేట్



వెంకటసుబ్బయ్య

వెంకటాచలం: జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పారామెడికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భువనగిరి వెంకటసుబ్బయ్యకు విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ పి.సుబ్బరామరాజు పర్యవేక్షణలో 'నాలెడ్జ్ అండ్ బిలీఫ్స్ అబౌట్ ట్రాన్స్‌మిషన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ లింపాటిక్ ఫైలేరియాసిస్ ఇన్ నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై వెంకటసుబ్బయ్య పరిశోధన గ్రంథం సమర్పించారు. దీంతో వీఎస్‌యూ ఈనెల 13న ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందవల్లి, అధ్యాపక సిబ్బంది వెంకటసుబ్బయ్యను అభినందించారు.

వినతుల స్వీకరణ



వినతిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి సోమవారం వినతి పత్రాలను స్వీకరించారు. ముఖ్యంగా రైతులు పొలాలకు సంబంధించి దారి వివాదాలు, అసైన్మెంట్ జాబితాలో సాగు చేసుకుంటున్న పొలాలను చేర్చాలని, పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని అర్జీలను అందజేశారు. వినతులను పరిశీలించిన తహసీల్దార్ సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

బాలచౌడేశ్వరికి జయంతి వేడుకలు

పొదలకూరు : పట్టణంలోని తొగటివీధిలో ఉన్న బాలచౌడేశ్వరీదేవి దేవస్థానంలో తొగటి సామాజిక వర్గానికి చెందిన వారు సోమవారం వైభవంగా బాలచౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టుకున్నారు. అమ్మవారిపై భక్తిని ప్రదర్శిస్తూ మహిళలు నృత్యాలు చేశారు.

సుపరిపాలనలో దేశానికే ఏపీ ఆదర్శం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలకు సుపరిపాలన అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 14, 15వ వార్డుల్లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగి ఉంటే చాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నిరకాల సంక్షేమ పథకాలు అందుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు అవసరమయ్యేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని గుర్తుచేశారు. అవినీతికి ఎలాంటి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని తెలియజేశారు.

ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు

నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న పొదుపు సంఘాల సభ్యులకు మెప్మా ఆధ్వర్యంలో రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణాలను ఎమ్మెల్యే ప్రసన్న చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి బ్యాంకు లింకేజీ రుణాలను పొంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, ఏపీఎం లలిత, మెప్మా సీఓ నర్మదా, ఎంపీపీ శ్రీనివాసులు, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, జయంతి, శ్రీదేవి, నాగరాజు, శివకుమార్ రెడ్డి, రహమత్, పార్టీ నేతలు సీతారామిరెడ్డి, అల్లాభక్షు, భరత్, డాక్టర్ అల్లాభక్షు, నరసింహారావు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ అంటే ప్రతిపక్షాలకు భయం



దివ్యాంగురాలికి బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వలంటీర్ వ్యవస్థను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని, అందుకే ఆ వ్యవస్థను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని తొమ్మిదో వార్డుకు చెందిన దివ్యాంగురాలైన చిడతల పెంచలమ్మకు ఎమ్మెల్యే ప్రసన్న తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా దాదాపు రూ.35 వేల విలువ చేసే బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్ల ఎందరో పేదలకు న్యాయం జరుగుతోందని, అలాంటి వారిపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వ్యంగంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు రెండు లక్షల కోట్లతో అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కు జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే వణుకు పుడుతోందని తెలిపారు. లోకేశ్ యువగళంతో, పవన్ వారాహి యాత్రతో భవిష్యత్తులో అధికారం వారిదే అని కలలు కంటున్నారని, ప్రజలు మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, అనంతమ్మ, నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, కోడూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వెంకన్నపాళేనికి మంత్రి కాకాణి రాక

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం వెంకన్నపాళెం గ్రామానికి వస్తారని ఎంపీడీఓ హేమలత తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ నరుకూరు సచివాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

కసుమూరులో..

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం కసుమూరులో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు కసుమూరు సచివాలయానికి చేరుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీకి పూడిపర్తి విద్యార్థులు




వసంత్‌సాయి మల్లి శిరీష

వెంకటాచలం: మండలంలోని పూడిపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పది ఫలితాల్లో పూడిపర్తి గ్రామానికి చెందిన వసంత్ సాయి 559 మార్కులు, తాటిపర్తిపాళేనికి చెందిన మల్లి శిరీష 562 మార్కులు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు జగనన్న సురక్ష క్యాంపులు

పొదలకూరు : మండలంలోని నావూరు, నేదురుమల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులను మంగళవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ నగేష్‌కుమారి సోమవారం వెల్లడించారు. ఈ క్యాంపుల్లో వెరిఫికేషన్ అయిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు.

నార్తురాజుపాళెంలో..

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో జగనన్న సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్బీఐ బ్యాంక్ పక్కన ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కొడవలూరు : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొడవలూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం సమీపించిన తరుణంలో మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో తాగునీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకొంటూ సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని గీతామాధురి, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, స్టాఫ్ నర్స్ యాస్మిన్, ఏఎన్‌ఎంలు అనిత, విజయలక్ష్మి, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీతోనే కోవూరు అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కోవూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని, ఎమ్మెల్యే ప్రసన్నపై జనసేన నేత గునుకుల కిశోర్ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని వైఎస్సార్‌సీపీ కోవూరు యువజన విభాగం అనుబంధ సంఘాల అధ్యక్షులు హెచ్చరించారు. కోవూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిపై అవగాహన లేని కిశోర్ ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అసలు షుగర్ ఫ్యాక్టరీలో చోరీ చేసేందుకే జనసైనికుల ప్రవేశించారన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కోవూరు నడిబొడ్డులో తేల్చుకోవాలని కిశోర్‌ను సవాల్ చేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా అభాగ్యులు, నిరాశ్రయులు, పిల్లలకు ఎమ్మెల్యే ప్రసన్న ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని, అవి కిశోర్‌కు కనపడ లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం కమిటీ సభ్యుడు అత్తిపల్లి అనూప్‌కుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, బీసీ యువజన విభాగం అధ్యక్షుడు మల్లికార్జున్, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, కోవూరు ఎమ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, పార్టీ నేతలు విజయకుమార్, సంపత్‌కుమార్, వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచ్ మోషే పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయిలో పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, అధికారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. లేఅవుట్లలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు, మోటార్ల ఏర్పాటుకు రూ.14 కోట్లు కేటాయించామని తెలిపారు. సిమెంట్, స్టీలు తీసుకుని పనులు మొదలుపెట్టని లబ్ధిదారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా గృహాలకు రుణాలు పొంది సొంత పనులకు నగదు వాడుకున్న వారిని పిలిపించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో నెల్లూరు కార్పొరేషన్ పనితీరు బాగుందన్నారు. మిగిలిన మండలాల్లోనూ పురోగతి సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ నాగరాజు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా, డ్వామా పీడీలు రవీంద్ర, వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కోటి కుంకుమార్చనకు ఆహ్వానం



కలెక్టర్‌కు అమ్మవారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు



ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఆహ్వాన పత్రం అందజేత

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో రేపటి నుంచి జరిగే కోటి కుంకుమార్చనకు పలువురు ప్రముఖులను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సోమవారం ఆహ్వానించారు. వీరిలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, జేసీ కూర్మనాథ్, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. వీటికి ఆహ్వాన పత్రాలను ఇచ్చి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ హైడ్రామా



అధికారులను బెదిరిస్తున్న టీడీపీ వర్గీయులు



సైడ్ కాలువను నిర్మించ తలపెట్టిన ప్రాంతం

- కాలువ పనులకు టీడీపీ వర్గీయుల ఆటంకం
- పోలీసులకు ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం: అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు టీడీపీ వర్గీయులు హైడ్రామాకు తెరలేపారు. ఈ ఘటన మండలంలోని రేబాల తూర్పు ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. పంచాయతీ అధికారులు, పోలీసుల కథనం మేరకు.. రేబాల గ్రామంలో రెండు నెలల క్రితం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు తూర్పు ఎస్సీకాలనీకి చెందిన వారు వర్షం వస్తే నీరు రోడ్లపై చేరుతోందని, రోడ్డు పక్కన సైడ్ కాలువ నిర్మించాలని ఎమ్మెల్యే ప్రసన్నను కోరారు. దీనిపై స్పందించిన ఆయన సచివాలయ నిధుల నుంచి సైడ్ కాలువ నిర్మాణానికి రూ.6.5 లక్షలను మంజూరు చేశారు. వీటితో సోమవారం సైడ్ కాలువను నిర్మించేందుకు పంచాయతీ కార్యదర్శి శ్యామ్ తన సిబ్బందితో వెళ్లి గుంతలు తీస్తుండగా స్థానికంగా ఉన్న టీడీపీ వర్గీయులైన కాబాకు మస్తానయ్య, కరిముల్లా, కిరణ్మయి, ఈశ్వరమ్మ పనులను అడ్డుకున్నారు. అంతే కాకుండా గుంతలు తీసేందుకు తెచ్చుకున్న వస్తువులను సైతం దురుసుగా పడేయడంతో పాటు అధికారులను దుర్భాషలాడారు. అంతే కాకుండా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని చనిపోతామని అధికారులను బెదిరించారు. అప్పటికీ అధికారులు టీడీపీ వర్గీయులకు చెందిన రెండు ఇళ్లకు అడుగు దూరంలో సైడ్ కాలువను నిర్మిస్తామని, సైడ్ కాలువ లేకపోతే వీధిలో వర్షపునీరు చేరుతుందని నచ్చచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వినకపోగా ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. దీంతో పనులను అడ్డుకున్న నలుగురిపై పంచాయతీ కార్యదర్శి శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీ రాజకుమార్

ఇందుకూరుపేట : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం ముప్పిపిప్పి పురుగును గుర్తించామని, వాటి నియంత్రణకు మందులు వాడాలన్నారు. పాముపొడ తెగులు మొదటిదశలో ఉందని, దీని నివారణకు మందులు వాడాలన్నారు. ఆయన వెంట డాక్టర్ విజయకుమార్‌నాయక్, అనూష తదితరులు ఉన్నారు.

నిరంతరం విద్యుత్ అందేలా కృషి



సబ్‌స్టేషన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఈఈ

మనుబోలు : గృహావసరాలకు నిరంతరం విద్యుత్ అందేలా కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ ఇస్మాయిల్ అన్నారు. మనుబోలులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్‌కు 15 ఏళ్ల క్రితం మరమ్మతులు చేశామన్నారు. మళ్లీ ఇన్నాళ్లకు మెయింటెనెన్స్ పనులు చేయడంతో మనుబోలు పరిధిలో 3 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగిందన్నారు. ఆయన వెంట ఏఈ రవికుమార్‌రెడ్డి, జేఈ నాగార్జున, అకౌంటెంట్ దినేష్, ఏఎల్‌ఎం కిశోర్‌కుమార్, సిబ్బంది మల్లికార్జున, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం

- కోవూరులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఏర్పాటు
- ఎమ్మెల్యే ప్రసన్న ప్రత్యేక చొరవ
- వినియోగదారులకు బహుళ ప్రయోజనం



కోవూరులో డివిజన్ కార్యాలయంగా మారనున్న ఏడీఈ కార్యాలయం

కోవూరు : దశాబ్దాలుగా కోవూరులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎందరో ప్రజాప్రతినిధులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి ప్రత్యేక ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఏర్పాటైంది. గతంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే ప్రసన్న ఈ మేరకు విన్నవించడంతో నియోజకవర్గానికి ప్రత్యేక డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలో విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఎదురైనా కావలి డివిజన్ కార్యాలయానికి పరుగులు తీయాల్సి వచ్చేది. కాగా ప్రస్తుతం ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. కోవూరు నియోజకవర్గ పరిధిలో కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, నార్తురాజుపాళెం సబ్ డివిజన్‌లు కావలి డివిజన్‌లో కలిసి ఉండేవి. ప్రస్తుతం నూతన ఉత్తర్వులతో నాలుగు సబ్‌డివిజన్‌లు కోవూరు డివిజన్ కేంద్రంలో విలీనం కానున్నాయి. దీనివల్ల వినియోగదారులు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయి.

హర్షణీయం



గతంలో రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ మరమ్మతులు, 133 కేవీ ఏర్పాటుకు అనుమతులు పొందాలంటే కావలి డివిజన్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి. వీటిని గుర్తించి కోవూరు నియోజకవర్గ కేంద్రంలోనే డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయం. రైతుల చిరకాల స్వప్నం నెరవేరింది.

– దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీఏపీటీ చైర్మన్, నెల్లూరు

తక్షణమే సమస్యల పరిష్కారం



విద్యుత్ వినియోగానికి సంబంధించి ఏ చిన్న సమస్య తలెత్తినా కావలి వెళ్లాల్సి వచ్చేది. దీని వల్ల సమస్యల పరిష్కారం ఆలస్యం అయ్యేది. ప్రస్తుతం కోవూరులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఏర్పాటు వల్ల తక్షణమే సమస్యలు పరిష్కారమవుతాయి. పాడి పరిశ్రమ రైతులకు విద్యుత్‌పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన సేవలు అందుతాయి.

– గొల్లపల్లి విజయకుమార్, ఏపీఎల్డీఏ చైర్మన్

ఆక్వారంగానికి ఎంతో ప్రయోజనం



ముఖ్యంగా విద్యుత్ పరంగా ఆక్వారంగంలో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలో ఆక్వారంగంపై ఎందరో రైతులు ఆధారపడి ఉన్నారు. వారికి ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, ఏర్పాటు విషయంలో అనుమతులు కోసం కావలి డివిజన్‌కు వెళ్లాల్సిన పనిలేకుండా కోవూరులో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనం.

– వీరి చలపతిరావు, చైర్మన్, డీసీఎంఎస్